# కలకంఠి కంటనీరు




శ్రీరంగం రాజేశ్వరరావు

మైసూర్ శాండల్‌వుడ్ సబ్బులా వుంటుందో—ఆ ఆకారంలో వుండే కళ్ళు, డబ్బూ అందం వున్న అమ్మాయి మనసులో గర్వంలా గ్రాడ్యువల్‌గా పెరిగి ఒక్కసారి సూదిగా ఆగి క్రిందికి జారిపోయి ఎంతో అందంగా కనబడే ముక్కు, రెండు సున్నాలు కలిపి వాటికి గులాబి రేకులు అంటించినట్టుండే పెదవులు నల్లగా షాంపూ చేసిన జుత్తు, ఎందుకో మైమరచిపోయి రెండు పాయలుగా చీలిపోయి ఓ పాయ ముందుకీ మరో పాయ వెనక్కీ జారి పిరుదుల్ని దాటగానే పట్టుక్కున ఏదో జ్ఞాపకమొచ్చి ఆగిపోయి ఒత్తుగా ఆశ్చర్యపోయి నల్లగా అతినల్లగా మెరుస్తూ నవ్వినట్టుండే ఓ రెండు కళ్ళు, ఎదుటికి కొంచెం పైన అతిసున్నితంగా ఓ చిన్న కిరీటంలాగ పైకి లేచి వెంటనే వెనక్కి జారిపోయిన ఓ చిన్న "బఫ్"

ఇవన్నీ కళ్యాణి కున్నాయి.

ఇవి మాత్రమేకాక తెల్లని వొంటి రంగూ, ఓ రెండంతస్తుల అందమైన మేడ, సాధారణంగా రెండో అంతస్తు దిగని నాన్నా వున్నారు. నాన్నకి బేంకులో ఓ రెండు మూళ్లక్షల ఎకౌంటుంది. అంతేకాక బొంబాయిలో వుండి అప్పుడప్పుడు ఇంటికొచ్చే అన్నయ్యా, ఓ చిన్నస్టేండరు కారూ, ఒక్కర్తే కూతురవడంవల్ల నాన్నకీ, ఒక్కర్తే చెల్లెలవడం వల్ల అన్నకీ కళ్యాణంటే ముద్దు కూడా వుండడం వల్ల ఆ అమ్మాయికి చాలా గర్వం వుంది. అహంభావమంతా చూపుల్లో వుంది. తేలిక భావమంతా జీవితం మీదా మామూలు (కారూ డబ్బూ లేని) మనుషుల మీదా వుంది. ఇదంతా ఇలా వుంచితే ఆ అమ్మాయికి అద్భుతమైన కంఠం వుంది. చాలా బాగానూ అందంగానూ పాడగలదామె. ఐతే ఆమె పాటల్లో చాలామంది వ్యాపరిసిన ఆకలి ఘోషలూ విరిగిపోయిన కలల పీడలూ వినిపించడంగాని కనిపించడంగాని జరగదు. పిల్లగాలులామె పాటల్లో పలకరిస్తాయి. కష్టమంటే తెలియనివ్వని జీవితం ఆమె పాటల్లో కళ్ళు తెరుస్తుంది. అంతమంచి

కంఠం వుండడం వల్ల ఆమె పాటల్లో గర్వం చాలా ఎక్కువై ఏపుగా పెరిగిపోయి కనురెప్పల్ని కలుసుకొని అక్కడ కాప్సి పొగడంవల్ల— ఆ అమ్మాయి కళ్లతో కింద చూపు లెప్పుడూ చూడదు. కారులో వెళ్తున్నప్పుడు కల్యాణికి ట్రాఫిక్కూ, తప్పితే ఆకాశం అంతేకాని రోడ్డెప్పుడూ కనబడదు.

తనందాన్నీ, తనని వెఱ్ఱిగా చూసే కుర్రాళ్ళన్నా జనమన్నా చాలా తేలికభావ మామెకి. సాధారణంగా ఎవరి పక్కా చూడని కల్యాణి ఎప్పుడో వోసారి ఎవరి పక్కైనా చూసినా "ఏమిటీ మనుషులు? వీళ్లు మనుషులే? ఇలాంటి మనుషుల మధ్యా నా లాంటి 'బ్యూటీక్వీన్' వుండడం?" అనుకొంటుంది. అనుకున్నట్టు చూస్తుంది... రోడ్డు మీద కాని ఎవరైనా చిరిగిన బట్టల్లో, లేకపోతే మాసిన బట్టల్లో కనిపించినా చాలా అసహ్య మామెకి. ముష్టి వాళ్లెవరు కనబడ్డా వాంతి ముంగినలా పెట్టినట్టు చూసి వాళ్లని అతిసున్నితంగా అసహ్యించుకుంటుంది. అలా జరిగిన రోజు రాత్రి డిన్నర్ దగ్గర ఓ పెద్ద లెక్చరిచ్చి "డాడీ! ఐ డోంట్ లైక్ దిస్ డర్టీ ఎట్మాస్ఫియర్." అని ముగించి "కొన్నాళ్లి! షార్ట్లీ యువిల్గో టు ఫారిన్." అని తల నిమిరిన తండ్రిని ఆప్యాయంగా చూసి అందంగా నవ్వేస్తుంది కల్యాణి.

ఆ విధంగా చాలా ముద్దుగా పెరిగిన కల్యాణి కొత్త వందరూపాయి నోటులా అతి పొందాగా వుంటుంది. పాతరోజుల్లో బంగారు కాసులా అతి అందంగానూ వుంటుంది.

అలా..నోట్ల కట్టల మీద 'నో వేకెన్సీ' బోర్డు చూసి కష్టాలు వెనక్కివెళ్ళిపోవడం వల్ల మిగిలిన సుఖాల మధ్య అతిసున్నితంగా పద్దెండేళ్ళు పెరిగిందా అమ్మాయి.

ఆ ఏడే పి. యు. సి. పాసవడం వల్ల వాళ్ళ నాన్నగా రామెని పిల్చి "ఏంతల్లీ ఏం చదువుతావ్ ?" అంటే ఆ అమ్మాయి చాలా అందంగా నిట్టూర్చి, "బియ్యే" అంది. ఎందుకంటే 'బియ్యే' చదవటం చాలా సులువనీ, సుఖమనీ అనుకుందామె.

సర్వసహజంగా .... కొద్ది రోజుల్లోనే ఆ వూళ్ళో వున్న కాలేజీ రోజూ వుదయం పది గంటలకీ, సాయంత్రం నాలుగున్నరకి ఎర్రగా మెరిసేది అందరి కళ్ళూ ఒకే దిక్కు కాస్సేపు చూసి బాధగా సోలిపోయేవి.

ఎర్రని స్టాండర్డు కారు 'అప్పో'క్క కాలేజీకి వస్తూంటే అందరూ రోడ్డు మీదే ఆగిపోయి (సెంట్రల్ మంత్రి గావొచ్చినట్టుగ) కంగారుగా అతికంగారుగా వెఱ్ఱిగా మనసులో పట్టినంత ఆతృతని కళ్ళలోకి పంపించి చూసి, ఎర్రటి వెలుగు వెళ్ళిపోయేక ఆ కొద్దిపాటి స్మృతుల్ని మళ్ళీ ఆతృత మధ్య బంధించి—అప్పటికి మనసుని కమ్మేసిన నిరాశతో వెళ్ళిపోయేవారు.

కాలేజీ కాంపౌండులో కారొచ్చిన తర్వాత అందరూ కారు చుట్టూ మూక్కుపోయినా ఆగిపోయి అటే చూసేవారు. సాయంత్రం నాలుగున్నరకి స్టాండర్డు కారు ఎర్రగా రోడ్డుని వెలిగిస్తూ హృదయం మీంచి జారిపోతున్న ప్రేమలాగ డౌన్ దిగుతూంటే మళ్ళీ అందరికళ్ళూ ఎర్రగా వెలిగి వల్లగా ఆరిపోయేవి.

ఇలా కొన్నాళ్ళయాక.... ఓసారేమైందంటే, కాలేజీలో పాటల పోటీ ఉంది. కల్యాణి పాడుతుందని తెలిసి జనం చాలామంది వచ్చేరు. ఆ తోపులాటలో టెర్లిన్ చొక్కాలు చిరిగేయి. చెప్పులు వేస్కొన్న కాళ్ళు బూట్ల కిందపడి నలిగేయి. జుత్తులు రేగేయి...కాని కల్యాణి పాడటం మొదలెట్టడంతో అన్నీ ఆగిపోయేయి. ఆ అమ్మాయికి డబ్బూ, కారూ, బోలెడందం వున్నాయని చాలామందికి తెలుసు కాని ఇంతమంచి కంఠం వుందని చాలామందికి తెలీదు...అసలందులో వాళ్ళెవరూ ఆమె గొంతుక విననివారే కనుక వాళ్ళంతా ఆనందంతోనూ ఆశ్చర్యంతోనూ కెరటాల్లాగ పొంగేరు. అంత అందమైన డబ్బున్న అమ్మాయి అంత 'మెరిట్' చూపిస్తూంటే అమ్మాయికి జెలసీ అప్పటికప్పుడే కల్యాణితో కలిసి రామక్రిష్ణా పార్కులో పడుక్కొని దొర్లుతూ డ్యూయట్ పాడుతున్నట్టు గ్రాహించుకుంటున్న అబ్బాయిలకి పట్టలేని సంతోషం కలిగేయి. ఇంతలోనే పాటైపోయింది. అందరూ దీర్ఘంగా నిట్టూర్చేరు. ఒకరిపక్కొకరు చూస్కొన్నారు. కల్యాణి పక్క కొందరు చూసేరు. కొందరు బైటికెళ్ళి సిగరెట్లు ముట్టించేరు. మిగతావాళ్ళు పాడుతున్నప్పుడు నానా గోల చేయడం మొదలెట్టేరు.

కల్యాణికి అంతా సంతృప్తిగా సంతోషంగా వుంది. తనంటే పడిచచ్చే ఈ వెఱ్ఱి వాళ్ల సంగతి తెలుస్తూనే వుంది...... వెప్పూర్ క్రీచర్స్....బోలెడ్డబ్బు లేనివాళ్ళకి "మైండ్ కూడా వుండదేమో!" అనుకుని నవ్వుకుంది కల్యాణి. ఇలా ఆలోచిస్తున్న కల్యాణి సడన్గా హాల్లో గోలాగిపోవడం, ఓ సన్నని అతి మధురమైన కంఠం వినిపించడం విని స్టేజి పక్క చూసింది. ఆ కంఠం వినగానే ఆమెకు సడన్గా తనకి ఫస్ట్ ప్రైజు రాదేమోననిపించింది. అప్పుడు చాలా అభిమానం, కోపం, ఇంకా ఎక్కువ జెలసీ కలిగేయామెకి. అలా గోలాగిపోవడానికీ, కల్యాణికి భయం కలగడానికీ ఓ ఐదడుగుల ఎనిమిదంగుళాల తెల్లని కారణం, స్టేజి మీద నిల్చొని పాడుతోంది. అటు చూసిన కల్యాణి అదోలా ఐపోయింది. అక్కడ ఓ తెల్లని అబ్బాయి నిల్చొని పాడుతున్నాడు. అతని పాటంత అందంగా అతనూ వున్నాడు. అతన్ని చూడగానే కల్యాణికి అదోలా అనిపించింది. అతని పాట మనసులోనూ రూపం కళ్ళలోనూ రికార్డైపోయినట్టనిపించింది. అతని పాట విన్నంతసేపూ అదోరకంగా అంతా మత్తుగా, మెత్తగా వున్నట్టు ఫీలయింది కల్యాణి. అతన్నా! క్షణంలో చూస్తుంటే మనసులో ముత్యాల వాన మురిపిస్తూ కురిసినట్టుంది. తెల్లని పాలరాతిలా పరుచుకున్న వర్తమానపు వెలుగులో అతను ఏలిదీపంలా మెరిసేడు. ఆ క్షణంలో మనస్సులో రెండు తెగల్ని, డబ్బున్నవాళ్ళూ, లేనివాళ్ళూ అన్న దాన్ని మరిచిపోయింది కల్యాణి.

మరి కాస్సేపయ్యాక అతని పాటైపోయింది.

అప్పుడు కల్యాణికి చాలా బాధ వేసింది. మిగతా వాళ్ల పాటలు వినాలనిపించలేదు,

వధువు కావలయును

హైదరాబాదులో నెలకు వెయ్యిరూపాయల ఆదాయము, విద్య, ఆందముగల 36 సం॥ నియోగి బ్రాహ్మణునకు రెండవ సంబంధముగా, సంస్కృతి, సహనము, స్వయంనిర్ణయముగల అతి చక్కని యువతి కావలయును. కులము, బీదరికము, వితంతువు, విడాకులు పొందినను అభ్యంతరంలేదు. అందచందములు అతి ప్రాధాన్యము పూర్తి వివరములు, ఫోటోతో క్రింది చిరునామాకు వ్రాయవలెను.

Box No. w/29,
C/o Andhra Patrika, Madras—1.








మీరెన్నో రకాలు
రుచి చూసి ఉంటారు
ఇవి వాటన్నిటికన్నా
మిన్న

బాలాజీ
పచ్చళ్ళు

అసలైన ఆంధ్రుల తయారి
తయారుచేయువారు
శ్రీ బాలాజీ ఇండస్ట్రీ
ప్రకాశం రోడ్డు, విజయవాడ-2.
న్యూ ఢిల్లీ . సికింద్రాబాద్ . మద్రాసు
ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో —
మా 1153 & 1154 స్టాల్స్
సందర్శించండి
POLAR BJ-68


# కలకంఠి కంటినీరు

గబగబా లేచి గరల్స్ రూంలోకివెళ్ళిపోయింది. ఆలోచనలు కాస్సేపు అందమైన పగటి కలల్తో ఆడుకున్నాయి...ఇంతలో ప్రోగ్రాం ఐపోయినట్టుంది. అందరూ వెళ్ళిపోతున్నారు. కల్యాణి కూడా బైటికి వచ్చేసింది.

ఇవాళ లేటౌతుందని డ్రైవర్ని రావద్దని చెప్పేసింది. మెల్లిగా రోడ్డు మీదకి వచ్చింది.

అప్పుడే చీకటి పడుతోంది. వచ్చీరాని వెన్నెల, హృదయంలో నిండీనిండని ప్రేమలా వుంది. వాచీ చూస్కొంది కల్యాణి. ఆరైంది. బస్సులో చాలా రష్‌గా వుంటుంది. అంచేత సరదాగా...జీవితంలో మొదటిసారి నడిచి వెళ్దామని నిశ్చయం చేస్కొంది కల్యాణి. ఐనా ఇంకా మరేదో కారణం కూడా వుంది. ఆ అబ్బాయి కనబడతాడేమోనని ఓ చిన్న ఆశ...మసగ వెన్నెల్లాగ మనసులో ఓమూల మెరిసింది. అంచేత కల్యాణి నడవడం ప్రారంభించింది...ఎప్పుడూ రాని ఆలోచనలీ వేళ మనసులో మెరుస్తున్నాయి. అవి మాత్రం అందంగానే వున్నాయి. ఎందుకో ఎప్పుడూ తెలియని స్మృతి, కాపోతే ఆలోచన అతి మెత్తగా అతి సున్నితంగా మనసు చుట్టూ అల్లుకుంటోంది. ఇలా ఆమెకు తెలీకుండానే ప్రేమ విత్తనం ఆమె మనసులో చాలా అందంగా నాటుకు పోయి ఎమోనియా ఎరువుల్లాటి ఆలోచనల అదుపు లేనితనంతో వెంటనే ఏపుగా పెరగడం ప్రారంభించింది. అలా ఆ అబ్బాయి గురించి ఆలోచిస్తూ కృష్ణానగర్ దగ్గర టర్నింగ్ తిరిగింది కల్యాణి....

అరే...ఏదో మెరుపు మెరిసినట్టు..అతను— ఇందాక అందమైన పాటపాడిన అందమైన అబ్బాయి. అదృష్టవశాత్తు ఆవేళ వెలిగిన స్ట్రీటులైటు కింద వెన్నెల్లా మెరిసేడు. వెన్నెల్లాగే వున్నాడు. తెల్లనిపేంటు తెల్లని షర్టు.....పలకరిస్తే బావుణ్ను. ఒక్కసారి ఆ ఆలోచన మెదిలేసరికి కల్యాణి మనసులో చాలా మెరుపులు తియ్యగా అందంగా వొణుకుతూ మెరిసేయి.

"హల్లో..."

అతనాగిపోయేడు. ఆశ్చర్యంగా చూసేడు. సొగసుని చూసి అందమైన వెన్నెల ఆశ్చర్య పోయినట్టుంది.

"చాలా బాగా పాడేరు" అంది కల్యాణి.

"ఓ...అదా! థాంక్స్."

అలా అని అతను వెళ్ళిపోబోయేడు.

"అరే...వెళిపోతున్నారే?"

"మరేం చెయ్యమన్నారు?"

"మా ఇంటికి 'టీ'కి రండి. అదిగో ఆ కనిపిస్తున్న మేడ మాదే."

"సారీ! పనుంది....."

"ఊహు! అలాకాదు. తప్పకుండా రావాలి. డాడీ క్కూడా పాటలంటే చాలా ఇష్టం. మీరు పాడి వినిపిస్తే ఆయనా మేడ రాసి చ్చేస్తారు."

అతన్నవ్వేడు. "భూమిమ్మాదేవో అనుకొని మెరుపు మెరిసి ఆకాశాని కెగిరి వెన్నెలని రాసుకొని వెళ్ళిపోతే ఆ వెన్నెల ముక్క తెగి భూమిమ్మొదకు...సరిగ్గా ఇక్కడికే... జారి తెల్లబట్ట లేసుకొని నవ్వినట్టుంది." అను కుంది కల్యాణి.

"చాలా మొగమాటంలో పెట్టేరు." అన్నాడు.

"నోనో... మీరొచ్చి తీరాలి..." అని నవ్వింది కల్యాణి.

అతను "సరే" అని కళ్ళతో నవ్వేడు. ఆ నవ్వు చాలా అందంగా వుండి కల్యాణి మనసు మీద ముద్రవేసి మరీ అందంగా మనసుని నవ్వించింది.

* * *

డ్రాయింగ్‌రూంలో ఎదురుగా కూర్చొన్న అతన్ని చూసి.

"మీ పేరు చెప్పేరు కాదు." అంది కల్యాణి.

కాలుమోపితే కరిగిపోయేట్టున్న మొజైక్ ఫ్లోరింగుని గోడల మీద బొమ్మల్నీ ఖరీదైన ఫర్నిచర్నీ చూస్తున్నతను గబుక్కున కంగారుపడి.

"ఓ. అయాంసారీ! నా పేరు బాల రాజు." అన్నాడు.

"పెలరాజులా వుంది." అని అనుకుందా మనుకున్న కల్యాణి అనుకోకుండానే ఈమాట పైకనేసింది. అనేసి చాలా సిగ్గుపడింది.

"థ్యాంక్స్ ఫర్ ది కాంప్లిమెంటు" అని తలదించుకున్నాడతను. అప్పుడతని జుత్తు నల్లని అతినల్లని చీకటిని వంకీలు తిప్పి అక్కడక్కడ మెరుగులు దిద్దినట్టు కల్యాణి కళ్లలో మెరిసింది. అందువల్ల ఆమె కళ్లు కూడా మెరిసేయి.

"నా పేరు..."

"తెలుసు. కల్యాణి కదూ? ఫస్ట్ ప్రైజు మీాకే వచ్చింది."

"అరే." అని చాలాసేపు ఆశ్చర్యపోయింది కల్యాణి. "మీారే బాగా పాడేరు. మీాకు రావల్సింది." అంది.

ఇంతలో 'బోయ్' టీ తెచ్చేడు బిస్కట్ల ప్లేటతని ముందుంచి 'తీస్కోండి' అంది కల్యాణి. అతనతి మొగమాటంగా తినడం ప్రారంభించేడు. "మీారు తీస్కోండి." అన్నాడు. "తీస్కుంటాను" అని నవ్వుతూ అంది కల్యాణి. అని బిస్కట్లు ప్లేట్లోంచి తీస్కోంది.

"డాడీ పడుక్కున్నారు. వొంట్లో బాపు లేదులా వుంది."

"ఓ. అయాంసారీ....."

"ఊహుఁ! సారీ చెప్పవల్సింది నేను. మరో రోజు మీారొచ్చి తప్పకుండా పాడాలి."

ఇద్దరూ టీ తాగేరు. కొంత నిశ్శబ్దం అతి సున్నితంగా అతి అందంగా కరిగి పోయింది.

"ఏమైనా మాట్లాడండి." అంది కల్యాణి.

అతను కాస్సేపాగి అన్నాడు. "వరద బాధితులకి సహాయార్థం ఓ పెర్ఫార్మెన్స్"

కల్యాణి మధ్యలో ఆ సంభాషణ తెంపే సింది.... "నో..నా అలాంటి వెందుకు... మనూళ్లో కొత్తగా ఓ నైటక్లబ్ పెడు తున్నారు. ఆ సైట్ చూశేరా? ఇటీజ్ సో నైస్" అందామె. అప్పుడు బాలరాజు అతివిచిత్రంగా ఆమె వేపు చూశేడు. మరి కాస్సేపేదో మాట్లాడేక "నే వెళ్తానండీ. థాంక్యూ వెరీమచ్." అని లేచేడు బాలరాజు. అతని ఫీలింగ్ మాత్రం దెబ్బతిందని కల్యాణికి తెలీలేదు.

"అప్పుడే వెళ్తారా?"

"ఊఁ! వెళ్లాలి."

"సరే కానీండి. మళ్లీ ఎప్పుడొస్తారు?"

"చెప్పలేను."

"అలాకాదు. ఎల్లుండాదివారం తప్ప కుండా రావాలి."

"ఐ విల్ ట్రై."

"నోనో! తప్పకుండా రావాలి. ఆ షరతు మీాదే మిమ్మల్నిప్పు డొదుల్తున్నాను."

అతన్నవ్వి "అలాగే లెండి." అని గేటు వేపు నడిచేడు. అతన్ని గేటుదాకా దిగపెట్టి లోపలికి వచ్చిన కల్యాణి రూంలో ట్యూబ్ లైటు కాంతి తగ్గినట్టు ఫీలయింది. ఇంకా అప్పటిదాకా హృదయంలో ఏదో మూల మెల్లిగా అతి మెల్లిగా అతి మెలోడియస్‌గా వినిపించిన పాట ఆగిపోయినట్టు కూడా అనిపించిందామెకి.

* * *

"మార్వలస్. అద్భుతంగా పాడేరు."

చాలా మెల్లిగా వాచీలన్నీ తిప్పి, ఇంకా మెల్లిగా, అతిమధురంగా వచ్చిన ఆదివారం. సాయంత్రం ఐదున్నర దగ్గర కాస్సేపాగింది.

పాటపూర్తి చేసిన బాలరాజు "థాంక్స్" అన్నాడు.

"చాలా బాగా పాడేవబ్బాయ్. ఇటీజ్ వెరీ నైసిన్‌డీడ్" అన్నారు పైపు ముట్టించిన కల్యాణి నాన్నగారు. పైపు ముట్టించింది కల్యాణికాదు. వాళ్ల నాన్నగారు.

కాఫీ తీస్కోని, కాసేపు కబుర్లు చెప్పిన్తరువాత, "డాడీ, మేములా వెళ్లొస్తాం. ఓ. కే.?" అంది కల్యాణి.

"ఓయ్యస్." అని వాళ్ల డాడీ ఆరి పోయిన పైపుని మళ్లీ వెలిగించేరు.

"వెళ్తానండీ. నమస్కారం." అన్నాడు, బాలరాజు.

"ఆఁ ఆఁ! అప్పుడప్పుడూ వస్తూండ వయ్యా." అన్నారతను.


"అలాగేనండీ." అన్నాడు బాలరాజు.

స్టేండర్డు కారు స్టీరింగు దగ్గర కూర్చొని,

"ఎక్కడికెళదాం?" అంది కల్యాణి.

"అయాం సారీ. నేనింటి కెళ్లాలి." అన్నాడు బాలరాజు కారు బైట నిలబడి దూరంగా ఆకాశంలోకి చూస్తూ.

అప్పుడు కల్యాణి డోర్ దగ్గరగా జరి గింది. అతని వైపు అదోలా చూసింది.



"ఇప్పుడు మీరెలా వున్నారో తెలుసా?" అంది.

"తెలీదు." అన్నాడు బాలరాజు చాలా సీరియస్‌గా.

"కాని వినండి. గ్రీకు శిల్పాలా చాలా గంభీరంగా వున్నారు. 'హీ లెట్స్ ట్విస్ట్' సినిమాలో హీరోలా వున్నారు."

"ఏమో! నేను సినిమా చూళ్లేదు."

"పోనీ, ఫరవాలేదులెండి: వచ్చి కూర్చోండి. అలా రామకృష్ణా పార్క్‌కెళదాం."

"రాక తప్పదంటారా?"

"ఊహూ! తప్పదు."

"అరే! అక్కడ కాదిక్కడ" అని ఫ్రంటు డోర్ తలుపు తీసి స్టీరింగు పక్క సీటు చూపించింది కల్యాణి. బాలరాజు కూర్చోగానే కారు కదిలింది.

"ఆడపిల్ల అడిగినా కాదనకూడదు. అంటే, చాలా బాధ పడతారు." అన్నాడు బాలరాజు.

"ఓహో. అయితే అందుకనా మీరు వస్తున్నది?" అంది కల్యాణి. బాలరాజు మాట్లాడ్లేదు. "కాదనడానికి నోరు రాలేదనండి. నే నడిగిన తరువాత కూడా కాదన గలరా?" అని మళ్లీ ఆమే అంది. అలా అన్నప్పు డామె కళ్లు అతిగర్వంగానూ, అతి అందంగానూ మెరిసేయి.

కారు టర్నింగు తిరిగింది.

అప్పుడే వెన్నెల పెల్లిగా పరుచు కుంటోంది. దూరంగా పార్కు తీరిన కోరికలా అతి హుందాగానూ, తీరబోయే కోరికలా అతి అందంగానూ కనబడుతోంది.

"మీ డ్రైవర్ లేడా?" అడిగేడు బాలరాజు.

"వున్నాడు. నేనే ఇవాళ రావద్దన్నాను."

కారు పార్క్ పైటాగింది.

బాలరాజు దిగి ముందుగానే ఇసకలోకి నడిచేడు. వెనగ్గానే కల్యాణి కూడా వచ్చింది. "కూర్చుందామా?" అంది. బాలరాజు కూర్చున్నాడు. కల్యాణి పక్కనే కూర్చోంది.

ఓ ఐదు నిమిషాలు గాల్లో కలిసిపోయేయి. ఏమీ మాట్లాడని బాలరాజుని చూసి కల్యాణికి చాలా బాధ వేసింది. "ఏమిటీ మనిషి నిర్లక్ష్యం? తనంటే లెక్కే లేదా? అందుకేనా తనకితనంటే ఇంతిష్టంగా వుంది." అనుకుందామె.




దూరంగా సముద్రంలోకి చూస్తున్న బాలరాజుని చూసి,

"ఏమైనా మాట్లాడండి." అంది.

"ఏం మాట్లాడమంటారు?" అని కాస్సేపాగి "నాది ఫైనలియర్. పరీక్షలు దగ్గర కొస్తున్నాయి." అన్నాడు బాలరాజు.

"అబ్బ! పరీక్షలు తప్ప మరో టాపిక్కే లేదా? ఫిలింఫేర్ అవార్డ్స్, బినాకా గీత్‌మాలా, ఇవేమైనా మాట్లాడండి. లేపోతే క్రికెట్ స్కోరు, ఎల్విస్ ప్రెస్లే పాటలు—ఇవైనా సరే."

"అయాం సో సారీ. ఇవేవీ నాకు తెలీవు. దేశంలో దరిద్రం గురించి కావలిస్తే మాట్లాడతాను. ఇంకా మన వైజాగ్ సందుల్లో వున్న పరిశుభ్రత గురించైనా సరే!"

అతనలా అన్న తరువాత కల్యాణి నవ్వింది.

"చాలా విట్టీగా మాట్లాడతారు." అంది.

అతనేమీ మాట్లాడలేదు. కనీసం కల్యాణి పక్క చూడనైనా లేదు. అందువల్ల బీచిలో పెరిగిపోతున్న వెన్నెల్లాగ కల్యాణి మనసులో బాధ కూడా పెరిగిపోయింది. "తనంటే ఈ నిర్లక్ష్యమేమిటి?" అనుకుంది. "తనకి మాత్రం బాలరాజంటే చాలా ఇష్టం" అని కూడా అనుకుంది.

కాస్సేపయ్యాక, "వెళదాం లెండి" అని లేచేడు బాలరాజు.

"మీతో ఏదో చెప్పాలనుకున్నాను." లేవకుండానే అంది కల్యాణి లేచి నిలబడ్డ బాలరాజు సముద్రం పక్క చూస్తూనే "చెప్పండి" అన్నాడు.

కల్యాణి అతని 'ప్రొఫైల్'ని పరీక్షగా చూసింది. తెల్లని సిల్కు పంట్లాంలో గులాబీరంగు టెర్లిన్ షర్టు 'టక్' చేసిన బాలరాజు, మంచుకొండల్లో గులాబీరేకులు పేర్చినట్టున్నాడు. పూర్తిగా పురివిప్పిన వెన్నెల్లో అతను మరో వెన్నెల్లా అతి అందంగా వున్నాడు.

"ఊహూ! ఇప్పుడు కాదు! మరోసారి." అని లేచింది కల్యాణి.

ఆ తరువాత రామకృష్ణా మిషన్‌హాస్పి- వ్రరని స్టేండర్డ్ కారులో దిగే అందమైన జంటకి అతిగా అలవాటుపడిపోయింది. మూణ్ణెల్ల క్రితం పాత వాచీ ఓమూలాపడేసి కళ్యాణి కొత్తగా కొన్న స్క్వేర్ వాచీలో పదిహేనో తారీఖు రెండుమార్లు పూర్తిగా తిరిగి మూడోసారి మళ్ళీ కనిపించింది.

ఆ రాత్రి బెడ్ రూంలో ఆకుపచ్చని బెడ్ రూం లైటు వేపు చూస్తూ, గుండెల మీద "టెంపెస్ట్" పుస్తకం పెట్టుకుని చాలా జాగ్రత్తగా బాలరాజు గురించి ఆలోచించింది కళ్యాణి.

"అతనితో మూణ్ణెల్లు తిరిగేను. సినిమా యాభై సార్లైనా టీ ఇచ్చేను. అతనింకా స్పష్టంగా తీసుకోకపోయినా, మనసిచ్చేను. అతను అతి అందంగా వుంటాడు. అందంగా పాడతాడు. ఇవన్నీ కాక మరేదో ఆకర్షణ... ఔను. నిర్లక్ష్యం! తనని, తన చనువుని




# లంచమంటే అనండి...

నా సంచిని పుస్తకాలతో నింపి, మంచి మాటలతో స్కూలుకు సాగనంపాలని కదూ మీ అభిప్రాయము? నాచేతి నిండా న్యూట్రీను టాఫీలు ముందు పెట్టండి. న్యూట్రీను పిప్పరమింట్లు, టాఫీలు ఎంత రుచిగా ఉంటాయో నాకు తెలుసు. మంచి బలము నిస్తాయని కూడ వాళ్ళు చెప్తారు. మీ నాన్నతో చెప్పు. న్యూట్రీన్ ఇవ్వమని.



Nutrine

న్యూట్రీన్ కన్‌ఫెక్షనరీ కం. (ప్రైవేట్) లిమిటెడ్
చిత్తూరు, ఆంధ్ర ప్రదేశ్

మిఠాయిలు, టాఫీలు

నిర్లక్ష్యం. చేసేనట్టుంటాడు. అందుకే నేమో తనకంత ఆకర్షణ? ఏదేమైనా ఎందుకో తమిద్దరి గురించీ ఎన్నో అను కుంటున్నారు. ఐనా అతను లెక్క చెయ్య లేదు. తనతో తిరుగుతూనే వున్నాడు అంటే...అతనూ తన్ని ప్రేమిస్తున్నాడన్న మాట....ప్రేమించకేం చేస్తాడు? తనందం, తన డబ్బూ, తనే అతన్ని కోరి ప్రేమిస్తే, అదతనదృష్టంకాదూ? ..... ఐనా రేపే ఏ విషయం. తెలుసుకోవాలి." అనుకున్నాక కల్యాణి మరి కాస్సేపు మధురమైన ఆలో చనలకీ, స్మృతులకీ మధ్య సొమ్మసిల్లి ఒక్కసారి లేచింది. తన డ్రాయర్లోంచి గులాబీరంగు కాయితం తీసింది. పెన్ను తీసి అతి జాగ్రత్తగా, అతి అందంగా రాసింది.

బాలరాజుగారూ,

'మీరు నిజంగా బాలరాజులే! ఇన్నాళ్లూ మీతో తిరిగి, మీ పరిచయపు స్మృతుల నీడల్లో కలలని పరుచుకున్న, ఈ అమ్మాయి మనసు మీకింకా అర్థం కాలేదంటే నాకు నిజంగానే చాలా ఆశ్చర్యంగానూ, బాధగానూ వుంది. ఇంకా, మొదటిసారి, మీమనసు లాక్కున్న అదృష్టం నాదైనందుకు చాలా సంతోషంగా కూడా వుంది. ఏ క్షణం తీరిక దొరికినా నేనేం చేస్తానో తెలుసా? మనసులో ముద్ర వేస్కున్న మీ రూపాన్ని కళ్ల ముందు పరుచుకుని, రికార్డైన మీపాటల్ని వింటూంటాను. అయాం సారీ! మనసింకా నా దగ్గరే వుంది. మీ పెర్మిషన్ కోసం చూస్తోంది. అన్నట్టు డాడీ ఏమీ అనరు. నేనెంతంటే అంతే! ఏమంటారు?

మీ—కల్యాణి

అని వుత్తరం రాసి, చాలా గర్వంగా, సం తృప్తిగా, ఆకుపచ్చని బెడ్రూం లైటు నీడలో అంత అందంగానూ నిద్రపోయింది కల్యాణి.

* * *

మరో నాలుగురోజులు పోయాక ఆది వారం, వణుకుతూ, సున్నితంగా అందంగా, గర్వంగా వచ్చింది. సాయంత్రం బాలరాజు వచ్చేడు.

"ఇవాళ ఎక్కడికీ వెళ్లొద్దు" అంది కల్యాణి.

"అలాగే. నాకోసారి ఎకనామిక్స్ టెక్ స్టివ్వండి." అన్నాడు బాలరాజు.

"ఒక్క ఎకనామిక్స్ టెక్స్టేనా?"అంది కల్యాణి. అలా అన్నప్పుడామె కంఠం లీలగా, హాయిగా వణికింది.

బాలరాజు కొత్తగా చూసేడు. "ఊఁ" అన్నాడు.

కల్యాణి లోపలికెళ్లి పుస్తకం తెచ్చింది. "తీస్కోండి." అంది. బాలరాజు తీస్కు న్నాడు. "ఓ పాట పాడతారా?" అంది కల్యాణి.

"సారీ! పాడను.చదువుకోవాలి. వెళ్తాను" అని లేచేడు బాలరాజు.

"మీ ఇష్టం. మళ్లీ త్వరలో రండి. వస్తారు కదూ?"

"ష్యూర్—రెండు మూడ్రోజుల్లో మీ పుస్తక మిచ్చేస్తాను." అని వెనక్కి తిరిగేడు బాలరాజు.

ఆ తర్వాత మెల్లిగా నడుస్తూ వెళ్లి పోయేడతను.

కల్యాణి మనసు అతి మధురంగా, కొంచెం భయంతోనూ, అతి గర్వంగా కొంచెం వణుకు తూనూ నిట్టూర్చింది.

* * *

మరో సెలవురోజు బాలరాజు రావలసిన రోజు డ్రాయింగ్ రూంలోనే సాయంత్ర మయేసరికల్లా కూర్చుంది కల్యాణి.

"బాలరాజు. వస్తాడు. రోజూలా కాదు. ఇంకా అందంగా, కొత్తరకంగా వస్తాడు. వచ్చి......"

"హలో! గుడీవెనింగ్."


"అరే! వచ్చేరా?" అని లేచింది కల్యాణి ఆమె కెదురుగా బాలరాజున్నాడు. అతని మొఖం మీద చిర్నవ్వూ, చేతిలో ఎకనామిక్స్ టెక్స్టూ వున్నాయి.

"ఔను. బహుశా ఆఖరిసారి. మీ వుత్తరం చదివేను. ఏమీ చెప్పదల్చుకోలేదు అంతా రాశేను. మీ పుస్తకమిదిగో. థాంక్యూ వెరీమచ్!!" అని పుస్తకం టేబిల్ మీద పెట్టి అతను వెనక్కి తిరిగేడు. మెల్లిగా నడుస్తూ వెళ్లడం ఇష్టంలేనట్టు వెళ్లి పోయేడు. అప్పుడు కల్యాణి మనసులో వెయ్యి దీపాల వెలుగు మెరిసింది. అందులో బాలరాజు మెరిసేడు.

గబగబా అతితొందరగా తన రూంలోకి వెళ్లి పుస్తకం మధ్యనున్న కాగితం తీసింది కల్యాణి.

కల్యాణిగారూ!

మీ నెంబరు పదహారో, పదిహేడో జ్ఞాప కం లేదు. ఐనా మీకు జవాబివ్వాలి. ఇవ్వక తప్పదు. మీ్రరాసిన వుత్తరం చాలా బావుంది. గుడ్! కృషి చేస్తే మంచి కథలు రాయొచ్చు మీరు. మీకు బాగా



డబ్బూ హిందీ కామెడీ చిత్రంలో హీరోయిన్ ఫాదర్‌లాంటి డాడీ వున్నారు. నాకవేమీ లేవు. నాకు బోలెడు బాధ్యతా, మీ అంత డబ్బు లేనితనం వున్నాయి. మీరు నాతో మాట్లాడిన మాటలు బట్టీ నా కో విషయం తెలిసింది. మీకున్న డబ్బుతో మీరేమైనా చేయగలరన్న అభిప్రాయం మీకున్నట్టు—ప్స్! సో ఇన్సోలెంట్. మీలాగ గర్వం హోదా నా కవసరంలేదు. ఎక్స్‌క్యూజ్‌మీ! నా స్నేహితురాలిగా—మీకు స్థానం మాత్రం ఎప్పుడూ వుంది. మీ అందమన్నా పాటన్నా నాకు చాలా ఇష్టం. గర్వాన్ని జాగ్రత్తగా ఏపుగా పెంచేసిన మీ మనసంటేమాత్రం కాదు. మీ మనసు నాకిచ్చినా అదివెంటనే తిరిగొచ్చేస్తుంది. అంచేత జాగర్తగా మీ దగ్గరే దాచుకోండి.

డబ్బుతో ఏమైనా కొనగలరుకాని మనసునిమాత్రం కాదు. అంతే—మీ 'టీ'లకీ మగాళ్ళ కంపెనీకి నా థాంక్స్. ఉంటాను.

బాలరాజు.

ఉత్తరం చదివిన కల్యాణి అలాగా కాస్సేపుండిపోయింది. జీవితంలో మొదటి సారి—ఆమె కళ్ళు పొదుపుగా, అతి పొదుపుగా కన్నీళ్ళు కార్చేయి. అప్పు డామె డైరీతీసి వణుకుతున్న చేతుల్తో రాసింది.

"జీవితంలో మొదటిసారి ఓడిపోయాను. అతను.....అతన్నిమాత్రం మర్చిపోలేను. అతన్లో ఏదో ఆకర్షణుంది. ఏం చేయడం ? ఏమీ లేదు. కాని...... ఇన్నాళ్ళూ మనసుని పరుచుకుని ఏపుగా మల్లె పొదలా పెరిగిపోయిన ఏదో భావం మాత్రం—విరిగిపోయింది."

అలా రాసి అలానే ఉండిపోయింది కల్యాణి.

ఆమె కళ్ళల్లోంచి రెండు కన్నీటి బొట్లు జారి డైరీ కాగితంమీదపడ్డాయి. అందువల్ల ఆమె రాసిన అక్షరాలు కొన్ని అలుక్కుపోయి అందంగా చెదిరేయి.

లైటు వేయకపోయినా—గదిలో వెల్లి వెన్నెల మాత్రం మత్తుగా పచ్చగా పరచుకుంటోంది.



MTP-1-P-1-65/66 TL